తెగని పంచాయితీ!

ఎనిమిది నిర్వాసితకాలనీలు.. వేలాది మంది ప్రజలు... వారి సౌకర్యం కోసం రెండు దశాబ్దాల కిందట నిర్మించిన కల్యాణ మండపం నాయకుల మధ్య ఆధిపత్యపోరుతో వినియోగానికి దూరమైంది. నిర్వహణ లేక శిథిలమైంది. అయినా ఎవరికి వారే యమునా తీరే అన్న చందంగా వ్యవహరిస్తున్నారు... పెత్తనం కోసం పితలాటకం పెడుతున్నారు. నిరాదరణ, నిర్లక్ష్యం వెరసి లక్షల ప్రజా ధనం వృథా అయింది. కాలనీల పెద్దల మధ్య తెగని పంచాయితీగా మిగిలింది. వెరసి ఫార్మా నిర్వాసిత కాలనీ (ప్రియదర్శినినగర్)లో నిర్మించిన కల్యాణ మండపం ఆకతాయిలు, మందుబాబులకు అడ్డాగా మారింది. నిర్వాసిత కాలనీల ప్రజలు శుభకార్యాలు చేసుకోవడానికి వేదిక కరువైంది.


ఫార్మాసిటీకాలనీలో శిథిలమైన కల్యాణ మండపం


గెడలు విరిసేసి తలుపులను విరగ్గొట్టిన దుండగులు


పెచ్చులూడి పోయిన పోర్టుకో పిల్లర్

కమిటీ నియామకంలో ఆధిపత్య పోరు

శిథిలమైన కల్యాణ మండపం

పట్టించుకోని నేతలు

ఆకతాయిలకు అడ్డాగా మారిన వైనం

ఫార్మా నిర్వాసితకాలనీ వాసులకు అవస్థలు

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు గాజువాక మండలం అగనంపూడి రెవెన్యూ పరిధిలో జేఎన్‌పీసీ నిర్వాసితులకు ఏపీఐఐసీ ఆధ్వర్యంలో లేఅవుట్లు వేసి పునరావాసం కల్పించారు. లేమర్తి, అగ్రహారం, పి.బోనంగి, కొత్తపాలెం, ఈదులపాక బోనంగి, ఏదురువానిపాలెం, డొప్పవానిపాలెం గ్రామాల వాసులకు పునరావాసం కల్పించారు. నిర్వాసిత కాలనీలకు మధ్యస్తంగా ఉందని భావించి లేమర్తి లేమర్తి, బోనంగి సరిహద్దుల్లో కల్యాణ మండపం నిర్మించారు. అయితే నిర్వహణ బాధ్యతల విషయంలో ఏకాభిప్రాయం కుదరకపోవడం వల్ల నిర్మించిన కొద్ది రోజులు చిన్న చిన్న కార్యక్రమాలకు మాత్రమే వినియోగించారు. నిర్వహణ కమిటీ ఏర్పాటు చేయకపోవడంతో నీటి వసతి, విద్యుత్ బిల్లులు ఎవరికీ పట్టకపోవడతో కల్యాణ మండపం కళావిహీనంగా మారింది. దీంతో ఫంక్షన్ హాలు నిర్వహణకు అన్ని కాలనీ పెద్దలతో కలిసి కమిటీ వేసుకోవాలనే ప్రతిపాదన వచ్చింది. ఐతే కల్యాణ మండపం, ఇదే ఆవరణలోని రామాలయం విషయంలో ఏకాభిప్రాయం కుదరకపోవడంతో కనీసం మరమ్మతులు చేపట్టి రంగులు వేసుకొనే పరిస్థితి లేకుండా పోయింది.


ఆవరణలో మందు సీసాలు

అధ్వానంగా... : కల్యాణ మండపం రంగులు వెలసి, పెచ్చులూడిపోయాయి. అటువైపు ఎవరూ వెళ్లకపోవడంతో ఆకతాయిలు తలుపులు, గ్రిల్స్‌ను విరగ్గొట్టి ఆవరణను మురుగు కూపంలా మార్చేశారు. లేమర్తి నాయకులు, వార్డు కార్పొరేటర్ చొరవ తీసుకొని అందరితో కలిపి కమిటీ ఏర్పాటు చేసుకొని ఫంక్షన్‌హాలును పునర్నిర్మించుకుంటే అందరికీ అందుబాటులో ఉంటుందని కాలనీలవాసులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో ప్రతీ చిన్న కార్యక్రమానికి ఇంటి ముందు రోడ్లు మీద లేదా లక్షలు వెచ్చించి కల్యాణ మండపాల్లో నిర్వహించుకోవాల్సిన పరిస్థితి దాపురించిందని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కల్యాణ మండపం మరమ్మతులు చేపడితే ఉన్న ఫలంగా చిన్న చిన్న కార్యక్రమాలకు వేదిక సరిపోతుందని అభిప్రాయం పడుతున్నారు.

కమిటీలు అవసరం



అన్ని కాలనీలకు ఉపయోగపడేలా కల్యాణ మండపం నిర్మించారు. అలాగే లేమర్తి, పానకాలయ్య బోనంగి పరిధిలో రామాలయం నిర్మించారు. వాటి నిర్వహణ అప్పటి నుంచి అలాగే మధ్యలో నిలిపివేశారు. కల్యాణ మండపం నిర్వహణ, రామాలయం అభివృద్ధి విషయంలో ఏకాభిప్రాయంతో అన్ని కాలనీ పెద్దలతో కమిటీ వేసుకుంటే సమస్య కొలిక్కి వస్తుంది.

– మంత్రి గిరి ప్రసాద్, ఫార్మాసిటీ కాలనీ

ఫంక్షన్లకు అవస్థలు



కమిటీ ఏర్పాటు చేసుకొని నిర్వహణ బాధ్యతలు తీసుకుంటే మండపం శిథిలావస్థకు చేరేది కాదు. ఫంక్షన్ హాలు లేకపోవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో ఇరుకు రోడ్లు మీదే నిర్వాసితులు కార్యక్రమాలు చేసుకుంటున్నారు. ఇప్పటికైనా స్పందించి కమిటీ వేసుకుని మరమ్మతులు చేసి వినియోగంలోకి తీసుకురావాలి. పెద్దలు పెద్దమనసుతో ముందుకు రావాలి.

– ఇల్లపు వాసు, నిర్వాసితకాలనీ యువత

ఆధునికీకరణకు ప్రతిపాదనలు



జీవీఎంసీ నిధులతో మరమ్మతులు చేపట్టి, ఆధునీకరించేందుకు ప్రతిపాదనలు చేశాం. ప్రస్తుతం జీవీఎంసీలో ఆమోదం కోసం ఫైల్ సిద్ధంగా ఉంది. ఆమోదం తెలిపిన వెంటనే కల్యాణ మండపాన్ని ఆధునికీకరిస్తాం. తరువాత గ్రామ పెద్దలతో చర్చించి నిర్వహణ కమిటీని ఏర్పాటు చేసే విషయాన్ని కొలిక్కి తీసుకువస్తాం.

–ఇల్లపు వరలక్ష్మి, వార్డు కార్పొరేటర్

క్లుప్తంగా

ఆలయం జోలికి వెళ్లలేదు


హిందూ సంఘాల ప్రతినిధులతో మాట్లాడుతున్న తహసీల్దార్ అమల

పెదగంట్యాడ: హిందూ ఆలయాలంటే గౌరవం ఉందని తహసీల్దార్ అమల అన్నారు. జీవీఎంసీ 65వ వార్డు పరిధిలోని వాంబే కాలనీలోని వైకుంఠ వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని కూలగొట్టేందుకు రెవెన్యూ సిబ్బంది వచ్చారని, భక్తులను భయభ్రాంతులకు గురిచేశారని చేసిన ప్రచారం వాస్తవం కాదన్నారు. విశ్వ హిందూ పరిషత్, హిందూ ధర్మ రక్ష సమితి, హిందు ధర్మ పరివార్ ప్రతినిధులు ఆలయాన్ని సోమవారం పరిశీలించారు. అనంతరం తహసీల్దార్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తమ సిబ్బంది ఆలయం జోలికి వెళ్లలేదన్నారు. ఆలయానికి ఆనుకొని అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారనే సమాచారంతో వెళ్లారన్నారు. భక్తులకు ఇబ్బందులు కలిగించలేదన్నారు. ఆలయం వద్ద ఎటువంటి నిర్మాణాలు చేపట్టవద్దంటూ కోర్టు నుంచి ఆదేశాలు ఉన్నాయన్నారు. ఆలయాన్ని అభివృద్ధి చేసుకునే ఉద్దేశం ఉంటే జిల్లా కలెక్టర్‌కు విన్నవించుకోవాలని సూచించారు. లేనిపక్షంలో దేవదాయ శాఖాధికారులతో మాట్లాడుకోవాలన్నారు.

క్లాప్ వాహనాల డ్రైవర్లు, లోడర్ల ఆందోళన


ఆందోళనలో పాల్గొన్న క్లాప్ వాహనాల డ్రైవర్లు, లోడర్లు

గాజువాక: జీవీఎంసీ గాజువాక జోన్ క్లాప్ వాహనాల డ్రైవర్లు, లోడర్లు సోమవారం ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా చెత్త సేకరణ వాహనాలను నిలిపివేశారు. తమకు రావాల్సిన జీతాలను చెల్లించకుండా కాంట్రాక్టర్ మాయ మాటలతో కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ప్రధాన కార్యదర్శి గొలగాని అప్పారావు మాట్లాడుతూ ఈఎస్ఐ, పీఎఫ్ చెల్లించడంలేదని, కార్మికులు పని ప్రదేశంలో ప్రమాదాలకు గురైనా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతినెలా జీతంలో కోత పెడుతున్నారని, చేతికి రూ.8 వేలు దాటి రావడంలేదన్నారు. వడదెబ్బతో డ్యూటీలో మృతి చెందిన లోడర్ గంగాభవాని కుటుంబ సభ్యులకు ఇచ్చిన రూ.2.50 లక్షల చెక్కు చెల్లలేదని పేర్కొన్నారు. ప్రతినెలా డ్రైవర్లు, లోడర్లు ఆందోళన చేస్తే తప్ప జీతం చెల్లించకపోవడం దారుణమన్నారు. ఇది ప్రభుత్వానికి సిగ్గు చేటని, ఈ పద్ధతిని వెంటనే మార్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఎం.రాంబాబు, నక్క నాగరాజు, ధనరాజు, చంటి, మహేష్, లక్ష్మి, కనక తదితరులు పాల్గొన్నారు.

పీఆర్టీయూ నూతన కార్యవర్గ ఎన్నిక


పీఆర్టీయూ మండల కమిటీ ప్రతినిధులు

అగనంపూడి: పీఆర్టీయూ గాజువాక మండల కమిటీ అధ్యక్ష, కార్యదర్శులుగా పీఆర్‌కేజు, రత్నసాగర్ ఎన్నికయ్యారు. స్థానికంగా సోమవారం నిర్వహించిన సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. కార్యనిర్వాహక అధ్యక్షుడిగా ఈ.సతీష్, మండల మహిళా అధ్యక్షురాలిగా టి.శ్రీదేవి, హైస్కూల్ ప్రతినిధిగా పాండవులును ఎన్నుకున్నారు. కార్యక్రమంలో విశాఖ జిల్లా అధ్యక్షుడు మద్దు శ్రీను, కార్యనిర్వాహక అధ్యక్షుడు దుర్గారావు, అసోసియేట్ అధ్యక్షుడు బి.మహేష్, అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దినాయుడు, నాయకులు మొదలవలస శ్రీనివాసరావు, జి.నరసింగరావు పాల్గొన్నారు.

27న జిల్లా స్థాయి యోగాసన పోటీలు

అగనంపూడి: యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అనకాపల్లి జిల్లా స్థాయి పోటీలు ఈనెల 27న పరవాడ మండలం వెన్నెలపాలెంలోని కల్యాణ మండపంలో నిర్వహించనున్నట్టు అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పిళ్లా రవిశంకర్, సీహెచ్.ఆంజనేయులు తెలిపారు. పోటీలు సబ్ జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో ఉంటాయని, పదేళ్ల నుంచి 55 ఏళ్ల లోపు వారు ఈ పోటీల్లో పాల్గొనవచ్చని తెలిపారు. ఇక్కడ ప్రతిభ చూపిన వారిని రాష్ట్ర స్థాయి పోటీలకు పంపించనున్నామని చెప్పారు. ఇతర వివరాల కోసం 93987 40982, 78010 83283 నంబర్లలో సంప్రదించాలని వారు కోరారు.

ప్రజలను మోసగించడంలో బాబు దిట్ట

- వైఎస్సార్‌సీపీ గాజువాక సమన్వయకర్త దేవన్‌రెడ్డి
- 64వ వార్డులో బాబు ష్యూరిటీ– మోసం గ్యారెంటీ


క్యూ ఆర్ కోడ్‌ను స్కాన్ చేయిస్తున్న దేవన్‌రెడ్డి

పెదగంట్యాడ: అధికారం కోసం ఎన్నికల సమయంలో హామీలు గుప్పించడం.. అధికారం చేపట్టిన తర్వాత ప్రజలను మోసం చేయడం చంద్రబాబు నైజమని వైఎస్సార్‌సీపీ గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డి విమర్శించారు. జీవీఎంసీ 64వ వార్డు పరిధి కొత్త దిబ్బపాలెంలో వార్డు అధ్యక్షుడు ధర్మాల శ్రీను ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ– మోసం గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా సోమవారం పార్టీ శ్రేణులతో కలిసి ఇంటింటా ప్రచారం చేపట్టారు. ఇందులో భాగంగా కరపత్రాలు పంపిణీ చేశారు. క్యూ ఆర్ కోడ్ స్కాన్ చేసి చంద్రబాబు చేసిన మోసాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా దేవన్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల ముందు చంద్రబాబు సూపర్ సిక్స్ హామీలతో పాటు మొత్తం 143 హామీలు ఇచ్చారని, అవి నమ్మి ప్రజలు పట్టం కడితే ఏ ఒక్క పథకమైనా మీకు అందుతుందా.. అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా హామీలు నెరవేర్చకపోవడం దారుణమని మండిపడ్డారు. కూటమి నాయకులు తమ ఇళ్ల వద్దకు వస్తే నిలదీయాలని ప్రజలకు సూచించారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కరోనా విపత్కర పరిస్థితుల్లోనూ ఏ ఒక్క సంక్షేమ పథకం ఆగిపోకుండా క్యాలెండర్ అమలు చేసి దేశానికే ఆదర్శంగా నిలిచారన్నారు. చంద్రబాబు అలా కాదని మోసానికే మారుపేరు అని ఎద్దేవా చేశారు. అనంతరం ఇంటింటికి తిరిగి చంద్రబాబు మోసాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో నాయకులు మార్టుపూడి పరదేశి, కదిరి భూలోక, నొల్లి స్వామి, కదిరి తాతారావు, కదిరి సత్తిబాబు, కొవిరి దేముడు, కొవిరి బాలు, కొవిరి ఆది, కొవిరి బాపనయ్య, కదిరి సత్తెయ్య తదితరులు పాల్గొన్నారు.

యారాడలో జెట్టీ నిర్మాణం వద్దు


కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న యారాడ గ్రామస్తులు

టీచర్స్: గాజువాక మండలంలో ఏకైక వ్యవసాయ గ్రామంగా ఉండి ఇప్పుడిప్పుడే పర్యాటకంగా అభివృద్ధి చెందుతున్న యారాడలో జెట్టీ నిర్మించాలన్న ప్రతిపాదనను ఉపసంహరించుకోవాలని ఆ గ్రామ రైతు సంక్షేమ సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్‌కు సోమవారం వినతి పత్రం సమర్పించారు. యారాడలో జెట్టీ నిర్మించాలని 2007లో అప్పటి ప్రభుత్వం ప్రతిపాదనలు తీసుకొచ్చిందని, ఇక్కడ జెట్టీ వద్దంటూ గ్రామ ప్రజలంతా విన్నవించుకోవడంతో నిర్మాణం ఆగిందని తెలిపారు. ఇప్పటికే తమ గ్రామానికి రెండు వైపులా రెండు మేజర్ పోర్టులు ఉండడం వల్ల ఊరిపైకి నీరు వచ్చి తీరం కొట్టుకుపోతుందని పేర్కొన్నారు. 2014లో హుద్‌హుద్ తుపానుకు ఒక చర్చి కూడా కొట్టుకుపోయిందన్నారు. ఉప్పునీరు తమ భూముల్లోకి వచ్చేసి వ్యవసాయం, భూగర్భ జలాలు దెబ్బ తింటున్నాయని పేర్కొన్నారు. జెట్టీ నిర్మాణం చేపడితే బ్రేక్ వాటర్ తమ గ్రామంపైకి వచ్చి ఆర్థికంగా, వ్యవసాయపరంగా, నీటి లభ్యతపరంగా దెబ్బతింటామని వివరించారు. భారతదేశంలోనే ఇది లోతైన సముద్రతీరం కావడంతో ఇక్కడ చేపల వేటకు కూడా అనువుగా ఉండదన్నారు. ఈ పరిస్థితుల దృష్ట్యా యారాడ గ్రామంలో జెట్టీ నిర్మాణ ప్రతిపాదనను ఉపసంహరించుకొని తమకు న్యాయం చేయాలని కోరారు. వినతి పత్రం సమర్పించినవారిలో రైతు సంక్షేమ సంఘం నాయకులు బంక రాము, రెడ్డి సన్యాసిరావు, ఉరుకూటి సూర్యనారాయణ, గుజ్జారి ప్రసాద్, బంక సన్యాసిరావు, అప్పారావు, పైడ్రాజు, చిట్టి, గణేష్ ఉన్నారు.

సజావుగా మంచినీరు సరఫరా చేయాలి


జీవీఎంసీ కమిషనర్‌కు సమస్యలు వివరిస్తున్న కార్పొరేటర్ చందు

గాజువాక: జీవీఎంసీ 70వ వార్డులో నీటి సరఫరాలో సమస్యలను పరిష్కరించాలని ఆ వార్డు కార్పొరేటర్ ఉరుకూటి చందు జీవీఎంసీ కమిషనర్‌ను కోరారు. ఈ మేరకు ఆయన సోమవారం పీజీఆర్ఎస్ కమిషనర్ కేతన్‌గార్గ్‌కు వినతి పత్రం అందజేశారు. వార్డులో నీటి సరఫరా సరిగ్గా నిర్వహించడంలేదని, వారంలో రెండు, మూడు రోజులపాటు నీటి సరఫరా ఉండడం లేదని వివరించారు. దీనివల్ల ప్రజలు ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. వార్డుకు వాటర్ పంపింగ్ కూడా సరిగా జరగడంలేదని కమిషనర్‌కు వివరించారు. ప్రతిరోజు మూడు, నాలుగు కాలనీలకు నీటి సరఫరా చేయడం లేదన్నారు. కొండవాలు కాలనీలకు ఉదయం ఐదున్నర, ఆరు గంటలకు ఇవ్వాల్సిన నీటిని ఎనిమిది గంటల తర్వాత ఇస్తున్నారని పేర్కొన్నారు. దీనివల్ల కూలి పనులకు వెళ్లాల్సిన నివాసులు తమ పనులను సైతం కోల్పోయే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని వినతి పత్రంలో కోరారు.

ప్రీ ఆటో పెయిడ్ స్టాండ్ సిద్ధం

దువ్వాడ ప్రయాణికులకు తప్పనున్న వసూళ్ల భారం



ప్రారంభానికి సిద్ధమైన ప్రీపెయిడ్ ఆటో స్టాండ్

అగనంపూడి: ఎట్టకేలకు దువ్వాడ రైల్వేస్టేషన్‌లో ప్రీ పెయిడ్ ఆటో, ట్యాక్సీ స్టాండ్ ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. మూడేళ్ల నుంచి దువ్వాడ రైల్వే యూజర్స్ అసోసియేషన్ ప్రీపెయిడ్ ఆటో, ట్యాక్సీ స్టాండ్ ఏర్పాటు చేయాలని పోలీస్ ఉన్నతాధికారులు, రైల్వే అధికారులను కోరుతూ వస్తోంది. రాత్రి సమయాల్లో కిలోమీటరు దూరానికి కూడా అధిక ధరలు వసూలు చేస్తుండడంతో ప్రయాణికులు ఆర్థిక భారం మోయాల్సి వచ్చేది. ప్రత్యామ్నాయం లేక వారు అడిగిన డబ్బులు చెల్లించి గమ్య స్థానానికి చేరుకొనేవారు. ఈ నేపథ్యంలో దువ్వాడ ట్రాఫిక్ సీఐ వెంకటరావు చొరవ తీసుకొని అధికారులను సంప్రదించి ప్రీ పెయిడ్ ఆటో స్టాండ్ ఏర్పాటుకు చేసిన ప్రయత్నాలు ఫలించాయి. పోలీస్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేస్తూ ప్రీపెయిడ్ ఆటో స్టాండ్‌కు స్థలం కేటాయించారు. భవన నిర్మాణం కూడా పూర్తయింది. త్వరలో ప్రారంభించడానికి చర్యలు చేపట్టడంతో ప్రయాణికులు, యూజర్స్ అసోసియేషన్ ప్రతినిధులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నేడు అష్టదళ పద్మారాధన

డాబాగార్డెన్స్: బురుజుపేట కనకమహాలక్ష్మికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు జరిగే ప్రత్యేక పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. ఆన్‌లైన్ పేమెంట్ చేస్తే వారి పేరిట పూజ చేస్తారు. వివరాలకు 0891–2711725, 2566514 నంబర్లలో సంప్రదించాలి.

ఏషియన్ వాలీబాల్ పోటీల్లో మెరిసిన చరణ్


కాంస్య పతకంతో చరణ్

ఉక్కునగరం: ఏషియన్ వాలీబాల్ పోటీల్లో స్థానిక డీఏవీ పాఠశాల పూర్వ విద్యార్థి అట్టాడ చరణ్ కాంస్య పతకం గెలుపొందాడు. ఇటీవల థాయ్‌లాండ్‌లో ఏషియన్ అండర్–16 పురుషుల వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో చరణ్ అత్యంత ప్రతిభ కనబరిచి కాంస్య పతకం సాధించాడు. చరణ్ 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు డీఏవి పాఠశాలలో విద్యనభ్యసించాడు. 2023–24లో ఘజియాబాద్‌లో జరిగిన అండర్–15 బాలుర విభాగంలో మొదటిసారిగా కాంస్య పతకం గెలుపొందాడు. ఆ తర్వాత స్పోర్ట్స్ హాస్టల్స్ ఎంపికై విద్యాభ్యాసాన్ని కొనసాగిస్తూనే జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించాడు. అదే విధంగా ఇటీవల అంతర్జాతీయ పోటీల్లో కూడా పాల్గొని పతకం సాధించాడు. ఈ సందర్భంగా చరణ్‌ను పాఠశాల చైర్మన్ ఎం. మధుసూదనరావు, ప్రిన్సిపాల్ సుగంధ కుమారి, ఉపాధ్యాయ సిబ్బంది, వ్యాయామ ఉపాధ్యాయులు అభినందించారు.

ఎస్సీ సెల్ ఉపాధ్యక్షునికి సత్కారం


పూర్ణ చంద్రరావును సత్కరిస్తున్న దేవన్‌రెడ్డి

పెదగంట్యాడ: వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పూర్ణ చంద్రరావును ఆ పార్టీ గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త తిప్పల దేవన్ రెడ్డి సత్కరించారు. పూర్ణచంద్రరావు సోమవారం దేవన్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. త్వరలో నిర్వహించనున్న ఎస్సీ సెల్ జిల్లా స్థాయి సమావేశానికి హాజరు కావాలని ఆహ్వానం పలికారు. కార్యక్రమంలో కార్పొరేటర్ శశికళ, నాయకులు బోని శివరామకృష్ణ, మార్టుపూడి పరదేశి, శేఖర్, శ్రీనివాస్, డేవిడ్, వెంకటేష్ పాల్గొన్నారు.

ఉపాధి కల్పించాలని ఉక్కు నిర్వాసితుల ఆందోళన


కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న స్టీల్ ప్లాంట్ నిర్వాసితులు

ఉక్కునగరం: విశాఖ స్టీల్ ప్లాంట్ నిర్మాణం కోసం భూములు, ఇళ్లు కోల్పోయి 45 ఏళ్లు గడుస్తున్నా ఇంకా 8500 మంది ఆర్ కార్డుదారులకు శాశ్వత పరిష్కారం చూపించలేదని నిర్వాసితులు వాపోయారు. ఈ పరిస్థితుల్లో కేంద్ర ప్రభుత్వం పెట్టుబడుల ఉపసంహరణ పేరుతో స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేయడానికి జారీ చేసిన ఉత్తర్వులను వెనక్కి తీసుకోవాలని 14 నెలలుగా పోరాటం చేస్తున్నా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు న్యాయం చేయాలని కోరుతూ వారంతా సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. అనంతరం అధికారులకు వినతిపత్రం అందజేశారు. కార్మికులను తగ్గించాలనే ఆలోచనతో స్టీల్ ప్లాంట్‌లో ఎన్నో ఏళ్లుగా పనిచేస్తున్న నిర్వాసితులను వైద్యపరీక్షల పేరుతో తొలగిస్తున్నారని ఆరోపించారు. ఆర్ నంబర్ ఉన్న వారికి ఉద్యోగం కల్పించాల్సిన బాధ్యత స్టీల్ ప్లాంట్‌పై ఉన్నా 8 సంవత్సరాల నుంచి ఒక్క నోటిఫికేషన్ కూడా తీయలేదన్నారు. నిర్వాసితులు పడుతున్న ఇబ్బందుల్ని అర్థం చేసుకొని ప్రతి ఒక్కరికీ ఉపాధి కల్పించాలని కోరారు. కార్యక్రమంలో పితాన భాస్కరరావు, ఎన్.ప్రసాద్, వంశీకృష్ణ, కె. గణేష్, రాంబాబు, ముసలి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరకుల వితరణ


సరకులు అందిస్తున్న సద్భావన సేవా సంఘ కార్యదర్శి, వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు పూర్ణ

అగనంపూడి: ఆపన్నులను ఆదుకోవడంలో సద్భావన సేవా సంఘం కార్యదర్శి, 85వ వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు జి.పూర్ణానందశర్మ (పూర్ణ) ముందువరుసలో ఉంటారని సర్వహిత చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు గుదే సుశీలా గజేంద్రరావు అన్నారు. సద్భావనా సేవా సంఘ ఆధ్వర్యంలో నిరుపేద మహిళ శేఖరమంత్రి వెంకట రమణమ్మ కుటుంబానికి నెలకు సరిపడా బియ్యం, పప్పులు, నూనె, ఇతర సామగ్రి అందించారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ కార్యదర్శి కిడిమి హనుమంతురావు, మహాత్మాగాంధీ సేవా సంఘం అధ్యక్షుడు చిత్తా రామారావు, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార కార్యదర్శి యలమంచిలి అప్పారావు, కొల్లి దేముడు తదితరులు పాల్గొన్నారు.

- జీవీఎంసీ 85వ వార్డు పెదమడకకు చెందిన ఫ్రెండ్స్ హెల్పింగ్ హ్యాండ్స్ ప్రతినిధులు గెద్దాడ రమేష్, డాక్టర్ తాతాజీలు చెట్టుమీద నుంచి జారిపడి మంచానికే పరిమితమైన నిర్వాసితకాలనీకి చెందిన పీత రమణ కుటుంబానికి నెలకు సరిపడా బియ్యం, ఇతర వంట సరుకులు అందించారు. కార్యక్రమంలో ఎంబీడీ గిరి, కడవల నాయుడు, ఆర్. రాము, పితాన భాస్కరరావు, బొంతు కనకరాజు, రాజు, సన్యాసి, దొమ్మేటి అప్పారావు, గుదే మహేష్, తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వసతుల కల్పనకు కృషి

అగనంపూడి: దువ్వాడ రైల్వేస్టేషన్‌లో ప్రయాణికులకు మెరుగైన వసతులు కల్పించేందుకు దువ్వాడ రైల్వే యూజర్స్ అసోసియేషన్ తనవంతు కృషి చేస్తుందని యూజర్స్ అసోసియేషన్ ప్రతినిధులు కె.చంద్రరావు, వి.జాషువా కె.ఈశ్వర్ అన్నారు. దువ్వాడ రైల్వే యూజర్స్ అసోసియేషన్ సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రయాణికుల సౌలభ్యం కోసం పలు రైళ్ల హాల్ట్, అదనపు సౌకర్యాల కల్పన కోసం శ్రమిస్తున్నామన్నారు. దువ్వాడ గ్రామంలో ఎవరైనా మృతి చెందితే రైల్వే ట్రాక్ దాటుతూ మృతదేహాలను మోసుకొని మంగళపాలెం శ్మశాన వాటిక వరకు తీసుకువెళ్తున్నారని, వీటిని నివారించడానికి ఫుట్ ఓవర్ వంతెన నిర్మించాలని కోరారు. అలాగే ఎన్టీపీసీ, అగనంపూడి మీదుగా ప్లాట్‌ఫారం ఒకటి నుంచి నాలుగును అనుసంధానం చేస్తూ సిటీ బస్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు.

నూతన కమిటీ ఎన్నిక

సమావేశం అనంతరం అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా కాటం కె.చంద్రరావు, అధ్యక్ష, కార్యదర్శులుగా వి.జాషువా, కె.ఈశ్వర్, ఉపాధ్యక్షులుగా మురళీధర్‌రెడ్డి, బి.కామేశ్వరరావు, సంయుక్త కార్యదర్శిగా ఆర్.రవి, కోశాధికారిగా వీర్రాజు, సలహాదారునిగా ఎంఎస్ఎన్ మూర్తి, కమిటీ సభ్యులుగా గుదే సుశీలా గజేంద్రరావు, లక్ష్మి, సరోజిని, సాయిరామ రాజు, భాస్కరరావు, భాస్కరరాజును ఎన్నుకున్నారు.